సాక్షి నల్లగొండ
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ఆశ చూపారు.. ముంచారు

యువకులు, నిరుద్యోగులే లక్ష్యంగా అధిక రాబడి ఆశ చూపిన ఓ ఆన్‌లైన్ యాప్ వారిని నిండా ముంచింది - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 590 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,10,446 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 1,62,000 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,273 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,200 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 697 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 996 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

నేడు చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ

నల్లగొండ క్రైం: జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం చింతపల్లిలోని పోలీస్‌స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించను న్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అక్కడ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించను న్నారు. శాంతిభద్రతల పరిధిలో ఉండే సమస్య లపై ప్రజలు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు ఇవ్వాలని ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌పై కేసు నమోదు

నల్లగొండ క్రైం: తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని గురువారం నల్లగొండ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగ రాజు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కిశో ర్‌పై 553(2) సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: వానాకాలం ధాన్యం సేకరణ వేగ వంతం చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురు వారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారులు, మార్కెటిం గ్, డీఆర్‌డీఏ, సహకార, వ్యవసాయ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం లో మాట్లాడారు. అన్ని ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో గన్నీ బ్యాగులను అందుబాటులో ఉం చాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నంలోగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల గ్రేడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశం లో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటే శ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు.

బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా పెండెం ధనుంజయ్ నేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

రామగిరి(నల్లగొండ): బీసీ జేఏసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్‌గా పెండెం ధనుంజయ్ నేత నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గురువారం ధనుంజయ్‌కు నియామక పత్రా న్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృ ష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, నాయకులు జెల్లా నరేందర్, నీల వెంక టేశం, నందగోపాల్, ఉదయ్, వనమాల రమే ష్, చాపల యాదయ్య, సయ్యద్, గంజి వెం కన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని ఫిజియోథెరపిస్ట్‌లపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్: అర్హత లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తూ, హోమ్ విజిట్లతో వైద్యం చేస్తున్న ఫిజియోథెరపిస్ట్‌లపై కఠిన చర్యలు తీసు కోవాలని ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం నల్లగొండ లో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియే షన్ బాధ్యులు డాక్టర్ సైదయ్య, డాక్టర్ యాదయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ వంశవ ర్ధన్, డాక్టర్ సత్యవాణి, డాక్టర్ అనూష, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ విజయ రామకృష్ణ, డాక్టర్ ప్రక్యాత్ ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిల వాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర సమయాల్లో రక్తం కొరత కారణంగా అనేక మంది ఆస్పత్రుల్లో చనిపోతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో యువత భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. రక్త దాన శిబిరంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలు, యువతకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడి షనల్ ఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రమేష్, శ్రీనివాస్, సీఐలు రాఘవరావు, రాజశేఖర్‌రెడ్డి, డానియెల్, కొం డల్‌రెడ్డి, ఎస్‌ఐలు సంతోష్, శ్రీను, సూరప్పనాయుడు, నాగ రాజు, శేఖర్, సందీప్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

నుడా.. పాలకవర్గం ఉండదా!

రెండున్నరేళ్లుగా నామమాత్రంగానే 'నీలగిరి పట్టణాభివృద్ధి సంస్థ'

- ఒక్క అధికారి, ఉద్యోగిని కూడా నియమించని ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ హయాంలో 'నుడా' ఏర్పాటు
- పాలకవర్గంపై దృష్టిపెట్టని కాంగ్రెస్ సర్కార్
- కార్యకలాపాలు అంతంత మాత్రమే..



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నీలగిరి పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా పాలక వర్గం లేక నామమాత్రంగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన నుడా కార్యక్రమా లు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. అధికారులు, సిబ్బంది ఒక్కరిని కూడా నియమించ లేదు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, మున్సిపల్ కమిషనర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారే తప్ప పూర్తి స్థాయి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. రాష్ట్రంలో కాంగ్రె స్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (కుడా) చైర్మన్‌ను నియమించినా, నీలగిరి అర్బన్ డెవల ప్‌మెంట్ అథారిటీకి చైర్మన్, పాలకవర్గాన్ని నియ మించలేదు. దీంతో నీలగిరి పట్టణాభివృద్ధికి బాటలు వేసే వారు లేకుండా పోయారు.

42 గ్రామాలతో ఏర్పాటు

నీలగిరి పట్టణంతో పాటు తిప్పర్తి, కనగల్, నల్లగొం డ రూరల్ మండలాల పరిధిలోని 42 రెవెన్యూ గ్రామాలను కలిపి ప్రభుత్వం 2022 జనవరి 31వ తేదీన నీలగిరి పట్టణాభివృద్ధి సంస్థ(నుడా)ను ఏర్పాటు చేసింది. దీంతో పట్టణం చుట్టూ పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని అంతా భావిం చారు. కానీ ప్రభుత్వం ఆచరణలో ఆ ఊసే లేకుం డా పోయింది. మున్సిపల్ కార్యాలయంలో నుడా చైర్మన్‌కు ఓ ఛాంబర్ తప్ప మరేమీ లేదు. పాలక వర్గం లేకపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలపై దృ ష్టి పెట్టే వారే లేకుండా పోయారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, మున్సిపల్ కమిషనర్ వైస్ చైర్మన్‌గా ఉన్న ప్పటికీ వారికి రెగ్యులర్ విధులతోనే సరిపోతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు నుడా పాలకవర్గంపై దృష్టి పెట్టలేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీలగిరి పట్టణ అభి వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెబుతున్నా.. నుడా పాలకవర్గం విషయాన్ని సీరియస్‌గా తీసు కోవడం లేదనే చర్చ సాగుతోంది.

ముందుకు సాగని కార్యకలాపాలు

పాలకవర్గం లేని కారణంగా నుడా కార్యకలాపా లు ఏ మాత్రం ముందుకు పోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడ రోడ్, హైద రాబాద్ రోడ్‌లో వెంచర్లు చేసేందుకు ఆయా గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించినా అవి కొలిక్కి రాలేదు. దీంతో ప్రజల భాగస్వామ్యం లో చేయాలనుకున్న వెంచర్ల అభివృద్ధి ప్రక్రియ నిలిచిపోయింది. అభివృద్ధి కోసం వెంటపడి ముం దుకు తీసుకెళ్లాల్సిన చైర్మన్, పాలకవర్గం లేకపోవ డంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. సిబ్బంది లేకపోవడంతో ఏమైనా పనులు ఉంటే మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో చేయించుకోవాల్సి వస్తోంది. పట్టణ అభివృద్ధి జరుగాలంటే చైర్మన్‌గా రాజకీయ నాయకులు ఉంటే కీలక ప్రజాప్రతినిధు లు, మంత్రి, జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపే అవ కాశం ఉంటుంది. అధికారులే చైర్మన్‌గా ఉండడం, పనిఒత్తిడిలో వారు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

ఆదాయం సృషించుకోవడమే..

నుడాకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆదాయం వచ్చే అవకాశం లేకపోయినా సొం తంగా రాబడి సృషించుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూములను నుడాకు కేటాయిస్తే వెంచర్లుగా అభివృద్ధి చేసే వీలుంటుంది. ప్రైవేటు వెంచర్ల లేఅవుట్ రూపంలోనూ సొం త ఆదాయం సమకూర్చుకోవచ్చు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు చేసే వెంచర్ల ద్వారా కొంత ఆదాయం వస్తుందే తప్ప నుడా ప్రత్యేకంగా చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో కొత్తగా భవన నిర్మాణాల అనుమతి ఫీజు నుంచి నుడాకు 30 శాతం నిధులు రావాల్సి ఉన్నా.. అమలుకు నోచుకోవడం లేదు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చిత్రంలో కలెక్టర్

అభివృద్ధి, సంక్షేమం భేష్

- అన్నిరంగాల్లోనూ మెరుగైన స్థానంలో సూర్యాపేట
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కితాబు



ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్, చిత్రంలో మంత్రి ఉత్తమ్ తదితరులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసిం చారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడారు. వైద్య ఆరోగ్యం, విద్యారంగాలు మెరుగైన స్థానంలో ఉన్నాయని, ప్రత్యేకించి విద్యలో 2024లో పదో తరగతిలో 96.91 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లో విద్యతోపాటు, చిన్న చిన్న చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీ, చిన్న చిన్న పరికరాల వంటివి తెలియజేస్తే వారు ఇంకా విజ్ఞానవంతులు కావడానికి అవకాశం ఉందన్నారు. ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజే యడం ద్వారా వారు ఎక్కువ జ్ఞానాన్ని పొందేం దుకు ఆస్కారం ఉంటుందన్నారు. స్వచ్ఛభారత్ వం టి కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వా ములను చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రజలను దారిద్ర్యరేఖనుంచి పైకి తీసుకువచ్చేం దుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రచయితలు, కళాకారులు అందర్నీ భాగస్వాము లను చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ముందుగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా సమగ్ర వివ రాలను గవర్నర్‌కు వివరించారు. జిల్లాలోని ముఖ్యమైన దేవాలయాలు, మసీదులు, బౌద్ధ స్థలాలు, చర్చిలతోపాటు, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ఉద్యానం, సం క్షేమం, నీటిపారుదల, విద్యుత్, పౌర సరఫరాలు, తదితర ముఖ్యమైన శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సవివరంగా తెలిపారు. ఈ కార్యక్ర మంలో కోదాడ శాసన సభ్యురాలు నలమాద పద్మా వతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం , జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, హుజూర్‌నగర్, సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్లు గెల్లి అర్చన, అన్నపూర్ణ, అన సూయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను రోల్‌మోడల్ చేయడమే లక్ష్యం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

దేశంలోనే అత్యధిక ధాన్యాన్ని రాష్ట్రంలో రైతులు పండిస్తున్నారని, రాబోయే రోజుల్లో వరిధాన్యం పండించడంలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా చేయాలన్నది తమ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మం త్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనం గా రూ.500 బోనస్‌ను సన్నధాన్యానికి ఇస్తున్నా మని తెలిపారు. జిల్లాలో నీటిపారుదల సౌకర్యం కింద 6.16లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తు న్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి ఎకరాకూ సాగు నీరు రావాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. సూర్యాపేటకు సంస్కృతి, సంప్రదాయాల పరం గా, చరిత్రపరంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు నోరు జారితే ఊరుకోం



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు

- మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం
- గాదరి కిషోర్ ఇసుక దొంగ అని అందరికీ తెలుసు
- భూపాల్‌రెడ్డిని ప్రజలు ఓడించినా బుద్ధిరావడం లేదు
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు

నల్లగొండ: బీఆర్‌ఎస్ నేతలు నోరు జారితే వారిపై చేయి చేసుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇతర బీఆర్‌ఎస్ నాయ కులు మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డీసీసీ అధ్య క్షుడు శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్‌బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమే ష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, కత్తుల కోటి గురువారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న ప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా దొంగల్లా దోచుకు తిన్నారని ఆరోపించారు. గాదరి కిషోర్.. నల్లగొం డ వ్యక్తిగా తుంగతుర్తిలో గెలిస్తే మేము అభినందిం చామని, విద్యావంతుడు అయి ఉండి విజ్ఞత లేకుం డా మాట్లాడడంపై మండిపడ్డారు. దొంగ నోట్ల కేసు లో ఇరికిన నీ చరిత్ర ప్రజలకు తెలుసని.. కోమటిరె డ్డిని విమర్శించే అర్హత నీకుందా అని ప్రశ్నించారు. భూపాల్‌రెడ్డిని ప్రజలు ఓడించినా బుద్ధిరాలేదని, నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని.. చావులు, దినాలకు పోయి తినుడు తప్ప ఏమి తెలియదని దుయ్యబట్టారు. రూ.వందల కోట్లు పెట్టి నల్లగొం డను అభివృద్ధి చేస్తుంటే కళ్లు కనిపిస్తలేవా అని అన్నారు. పదేళ్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి ఎస్‌ఎల్‌బీసీకి రూపాయి నిధులు కేటాయించకున్నా ఆ రోజు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణకు కోమటిరె డ్డికి సంబంధం ఏంటని నిలదీశారు. అది గత ప్రభుత్వ హయాంలోనే అయిందన్నారు. ఇప్పటికై నా బీఆర్‌ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, పిచ్చిగా మాట్లాడితే ఇళ్లను ముట్టడిం చాల్సి ఉంటుందన్నారు. నిజంగా మా వైపు నుంచి పొరపాట్లు ఉంటే మీరు ధర్నాలు చేయండి.. నిల దీయండి అంతేకాని అనుచిత వ్యాఖ్యలు చేయొద్ద న్నారు. గతంలో మేము ఐదేళ్లలో ఒక్కసారి కూడా ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించలేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధుల తరహాలో వ్యవహరిస్తూ సంస్కార వంతమైన భాష మాట్లాడాలని హితవు పలికారు. లేదంటే మేమెంటో చూపిస్తామని హెచ్చరించారు.

వైద్యసిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలి

నల్లగొండ టౌన్: మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఇతర వైద్యసిబ్బంది తమ పనితీరును మెరుగుపర్చుకుని మంచి ఫలితాలు సాధించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌జీఓ భవన్‌లో జరిగిన నల్లగొండ డివిజన్ స్థాయి వైద్యసిబ్బంది సమావే శంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, పథకాల అమలు సాధించిన ఫలితాలు అందిస్తున్న వైద్యంపై సమీక్షిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డాక్టర్ అరుంధతి, మెడికల్ ఆఫీసర్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను తయారు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: ఉత్తమ ఉపాధ్యాయులను తయారు చేయారు చేసే బాధ్యత బీఈడీ అధ్యాపకుల పైనే ఉందని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం ఎంజీయూలో బీఈడీ అధ్యాప కులు, కళాశాలల యాజమాన్యాలతో నిర్వహించిన ఒక రోజు శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఈడీ పాఠ్య ప్రణాళికలో మార్పులకు అనుగుణంగా బోధన సాగించాలన్నారు. సమాజానికి సేవలు అం దించే మంచి పౌరులను తయారు చేసే అవకాశం ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మాత్రమే లభిస్తుం దన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఆడిట్ సెల్ డైరెక్టర్ అంజిరెడ్డి, జయంతి, సరిత పాల్గొన్నారు.

సాగు సర్వే.. సందిగ్ధం

- ప్రత్యేక యాప్‌లో పంటల నమోదుకు ఏఈఓల విముఖత
- నేటికీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయని కొందరు వ్యవసాయ విస్తరణాధికారులు
- క్షేత్రస్థాయి సర్వేలో అనేక ఇబ్బందులు
- సాంకేతిక సమస్యలతో అవస్థలు
- సర్వే చేసి తీరాల్సిందే అంటున్న అధికారులు



నల్లగొండ అగ్రికల్చర్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాఫ్ సర్వే ప్రక్రియపై సందిగ్ధత నెలకొంది. ప్రత్యేక యాప్‌లో పంటల నమోదులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా యని ఏఈఓలు అంటున్నారు. సమయాభావం, రైతుల నుంచి సహకారం లేకపోవడం, సహాయకు లు ఎవరూ లేకపోవడం వల్ల ఈ డిజిటల్ సర్వే చేసేందుకు ఏఈఓలు విముఖత చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నప్పుడు నెట్‌వర్క్ లేకపోయినా, ఫోన్ వచ్చినా, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు ఆటంకం కలుగుతుందన్నారు. దీంతో ఇప్పటికీ చాలామంది ఏఈఓలు ఆ యాప్ కూడా డౌన్‌లోడ్ చేసుకోలేదు. అధికారులు మాత్రం సర్వే చేసి చేసి తీరాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు.

సాగు సమస్యలను అధిగమించేందుకు..

డిజిటల్ యాప్‌లో పంటలు నమోదు చేయడం వల్ల దిగుబడి, మార్కెటింగ్, ఇతర సమస్యలను అధిక మించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను ప్రవేశపెట్టింది. దానికి అవసరమైన ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసి ఏఈఓలు అందరూ డౌన్ లోడ్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ సూచిం చింది. ఈ నెల మొదటి వారంలో డిజిటల్ సర్వేపై శిక్షణ కూడా ఇచ్చింది. డిజిటల్ సర్వేలో భాగంగా ఏఈఓ తన క్లస్టర్ పరిధిలోని అన్ని గ్రామాల్లోని రైతులకు సంబంధించిన పంటల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయడంతో పాటు సర్వే నంబర్ లో ఫొటో దిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కో సర్వే నంబర్‌లో ఎంత మంది రైతులు ఉన్నా వారందరి పంటల వద్ద ఫొటోలు దిగి అప్‌లోడ్ చేయాలి.

సగం మంది మహిళా ఏఈఓలే..

ఒక్కో ఏఈఓ ఆరువేల నుంచి 12 వేల ఎకరాల వరకు డిజిటల్ క్రాఫ్ సర్వేను చేయాల్సి ఉంటుంది. దీనికి ఏడాది సమయం అయినా సరిపోదని ఏఈఓలు చెబుతున్నారు. జిల్లాలో 140 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు ఉండగా అందు లో సగానికి పైగా మహిళలే. మహిళా ఏఈఓలు ఫీల్డ్‌కు వెళ్లి డిజిటల్ క్రాఫ్ సర్వే చేయాలంటే అక్కడ ఎదురయ్యే సమస్యలతో పాటు రక్షణకూడా కరువ వుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు సహాయకులను ఏర్పాటు చేసి సరైన రక్షణ చర్యలు ఉంటేనే సర్వేకు అనుకూలంగా ఉంటుందని మహి ళా ఏఈఓలు అభిప్రాయపడుతున్నారు.

సర్వే చేస్తున్నది 30 మందే..

జిల్లా వ్యాప్తంగా 140 మంది వ్యవసాయ విస్త రణ అధికారులు ఉండగా ఇప్పటి వరకు 30 మంది ఏఈఓలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫీల్డ్‌కు వెళ్తున్నారు. చాలా మంది ఏఈఓలు ఫీల్డ్‌కు వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారులు మాత్రం కేంద్ర ప్రభుత్వ పథకమైన డిజిటల్ క్రాఫ్ సర్వేను కచ్చితంగా చేయాల్సిందే అని ఏఈఓలకు ఆదే శాలను జారీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు అంటేనే క్షేత్రస్థాయిలో ఉండే ఉద్యోగాలని గుర్తుంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సర్వే తప్పనిసరిగా చేయాల్సిందే..



డిజిటల్ క్రాఫ్ సర్వేను కచ్చితంగా ఫీల్డ్ లెవల్‌లో సర్వే నంబర్ల ఆధారంగా తప్పకుండా చేయాల్సిందే. ఉద్యోగులంటే విధిగా ప్రభు త్వం ఇచ్చిన ఆదేశాలు పాటించాల్సి ఉంటుం ది. ఇప్పటికే కొందరు ఏఈఓలు డిజిటల్ సర్వేను ప్రారంభించారు. మిగతా వారు కూడా ప్రారంభించే అవకాశం ఉంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ



జర్పులతండాలో సివిల్ సర్వీస్ బృందం

ప్రభుత్వ పథకాల అధ్యయనంలో భాగంగా గురువారం చింతపల్లి మండలం జర్పులతండాలో పర్యటించిన సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందానికి స్థానికులు బతుకమ్మలతో స్వాగతం పలికారు. - చింతపల్లి

క్లుప్తంగా

27న ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

మునగాల: కోదాడలోని సీసీ రెడ్డి హైస్కూల్ నందు ఈ నెల 27న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిబాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ ఆజాంబాబా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న అండర్–14, 17 బాలబాలికలు పాల్గొనవచ్చునని తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు తమ పాఠశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించిన బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌ను అదేరోజు బాస్కెట్‌బాల్ పోటల ఇన్‌చార్జి దేవరాజ్‌కు అందజేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9989457087 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

జాతీయ ఉత్తమ రైతుగా సయ్యద్ అలీ



కోదండ రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న సయ్యద్ అలీ

కేతేపల్లి: మండలంలోని కొసనగోడు గ్రామానికి చెందిన యువరైతు షేక్ సయ్యద్ అలీ జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. సయ్యద్ అలీ గ్రామంలో తనకున్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో గత నాలుగేళ్లుగా డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతనంగా ఆవిష్కరించిన వరి వంగడాలను మొదట తన వ్యవసాయ భూమిలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తూ వాటి పునరుత్పత్తికి కృషి చేస్తున్నాడు. వ్యవసాయంలో నూతన పద్ధతులు అవలంబిస్తూ ఆదర్శంగా నిలిచిన సయ్యద్ అలీని భారతీయ వరి పరిశోధనా సంస్థ(ఐసీఏఆర్) జాతీయ ఉత్తమ రైతుగా ఎంపిక చేసింది. రైతు దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీలో రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో అటార్నీ డైరెక్టర్ ఎస్‌కే.మీరా, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జానయ్య పాల్గొన్నారు.

కంపోస్టు యార్డులు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట: మున్సిపాలిటీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో భాగంగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య విధానాన్ని అధ్యయనం చేయడానికి నల్లగొండ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు గురువారం బాలెంల, జమునానగర్ కంపోస్టు యార్డులను, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం మున్సిపాలిటీలో చేపడుతున్న తడి, పొడి చెత్త సేకరణ, చెత్తను వర్మీ కంపోస్టు, విండో కంపోస్టు చేస్తున్న విధానాన్ని మున్సిపల్ కార్యాలయంలో సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ వారికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు యూసుఫ్, దండు శ్రీను, రామదుర్గారెడ్డి, మున్వర్‌అలీ, బాలయ్య, భాస్కర్‌రెడ్డి, వీరేంద్ర, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్‌ను సన్మానిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గవర్నర్‌ను సన్మానిస్తున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



పేరిణి నృత్యం చేస్తున్న విద్యార్థులు



నాట్యం చేస్తున్న చిన్నారి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్



ఎంజీయూలో ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: జాతి నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం ఎంజీయూలో ఎన్‌సీసీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రమశిక్షణ కల్గిన విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్తారని యువత దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో ఎన్‌సీసీ పాత్ర కీలకమన్నారు. 31వ బెటాలియన్ కల్నల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ఎన్‌సీసీ సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు పారా మిలటరీ బలగాల్లో క్రమశిక్షణ కలిగిన అధికారులుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంజీయూ నుంచి 40 మంది క్యాడెట్లను ఎంపిక చేస్తామన్నారు. ఎన్‌సీసీ అధికారిగా మచ్చేందర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎ. రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధారాణి, రేఖ, జగన్నాథ, హరీష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..

గణిత మేథావి శ్రీనివాస రామానుజన్ గణితంలో చేసిన పరిశోధనలు భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని, ఆయనను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురవారం ఎంజీయూలో సైన్స్ కాలేజీ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనలకు గణితశాస్త్రం కీలకమన్నారు. అనంతరం 23న నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ కాలేజీ డీన్ వసంత, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, కన్వీనర్ ఉపేందర్‌రెడ్డి, కోకన్వీనర్ హైమావతి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ జట్టును అభినందించిన వీసీ

ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే అంతర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంజీయూ తరఫున పాల్గొనేందుకు వెళ్తున్న జట్టును గురువారం వీసీ అల్తాఫ్ హుస్సేన్ తన చాంబర్‌లో అభినందించారు. ఈ పోటీల్లో రాణించి యూనివర్సిటీకి మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. వారి వెంట జట్టు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ నారాయణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ దుర్మరణం

- ఇద్దరికి గాయాలు



నీలమ్మ (ఫైల్)

నకిరేకల్: జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళా కూలీ మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో గురువారం రాత్రి జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన లింగంపల్లి సోమయ్య, నీలమ్మ(42) దంపతులు తమ ఇద్దరు కూమారులతో కలిసి ఏడేళ్ల క్రితం నకిరేకల్‌కు వలస వచ్చి పన్నాలగూడెంలో నివాసముంటున్నారు. సోమయ్య పన్నాలగూడెం గడ్డ వద్ద పంక్చర్ షాప్ పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నీలమ్మ అప్పుడప్పుడు కూలీ పనులకు వెళ్తూ భర్తకు చేదోడువాదోడు ఉంటుంది. గురువారం నీలమ్మతో పాటు పన్నాలగూడేనికి ఎదుళ్ల జ్యోతి, భాగ్యమ్మ కలిసి చందంపల్లి శివారులో ఓ రైతు భూమిలో పత్తి ఏరేందుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ముగ్గురు కలిసి చందంపల్లి శివారులో జాతీయర రహదారి పక్కన నుంచి నడుచుకుంటూ పన్నాలగూడెం గ్రామ స్టేజీ వచ్చి హైవే దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం నీలమ్మను ఢీకొట్టింది. దీంతో నీలమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఎదుళ్ల జ్యోతి, భాగ్యమ్మకు స్వల్పగాయాలయ్యాయి. నీలమ్మ మృతదేహన్ని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్వర్టును ఢీకొని..



మహేష్ (ఫైల్)

బొమ్మలరామారం(తుర్కపల్లి): బైక్‌పై వెళ్తున్న యువకుడు కల్వర్టును ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ తక్యూద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల మహేష్(27) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన మహేష్ బైక్‌పై గురువారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుర్కపల్లి మండలం మాధాపూర్ గ్రామ సమీపంలో అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాటు కోసం స్థల పరిశీలన



నర్సింహాపురం గ్రామ పరిధిలో పాలేరు వాగును పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

మోతె: మండల పరిధిలో ఇసుక రీచ్‌ల ఏర్పాటు కోసం మైనింగ్ ఆర్‌ఐ వసుమతి గురువారం నర్సింహాపురం వద్ద పాలేరు వాగును పరిశీలించారు. వాగులో నీరు ప్రవహిస్తుడడంతో నీరు తగ్గిన తర్వాత వాగులో ఏ మేరకు ఇసుక లభిస్తుందో పరిశీలించి రీచ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆమె వెంట ఇరిగేషన్ ఏఈ లింగయ్య, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ మహమ్మద్ సోఫియానుద్దీన్, ఆర్‌ఐ మన్సూర్ అలీ, జూనియర్ అసిస్టెంట్ నాగయ్య ఉన్నారు.

పోలీసు కుటుంబాల డిమాండ్లను పరిష్కరించాలి



వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ: పోలీసు కుటుంబాల డిమాండ్లను పోలీసు ఉన్నతాధికారులు ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించాలని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసులు తమ హక్కుల కోసం పోరాడే అవకాశం లేనందున వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేయడం వెనుక పోలీసులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని అర్థం చేసుకోవాలన్నారు. పోలీసు శాఖపై రాజకీయ నాయకులు విపరీతమైన ఒత్తిడి తెస్తుండడంతో పలు సందర్భాల్లో పోలీసులు ప్రజాకంటకులుగా మారే పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించిత పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించి ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించేలా కృషిచేయాలన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందజేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



గవర్నర్‌కు వినతి పత్రం ఇస్తున్న జగదీష్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని.. కనీసం నష్టాన్ని కూడా అంచనా వేసే ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. పత్తికి సంబంధించి మన రాష్ట్రం పట్ల కేంద్రం కూడా వివక్ష చూపిస్తోందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణ రైతాంగానికి రూ.8,257 మద్దతు ధర ఇప్పించాలని గవర్నర్‌ను కోరానన్నారు. పత్తి సాగుచేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.475 బోనస్‌ను కూడా ఇప్పించాలన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటివరకు విధివిధానాలు కూడా సరిగా రూపొందించలేదని అన్నారు. ఈ విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని గవర్నర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో జగదీష్‌రెడ్డి కోరారు.

తండ్రికి నెల మాసికం పెడుతూ కుమారుడు మృతి

- పిండప్రదానం అనంతరం కోనేరులో స్నానానికి వెళ్లి నీటమునిగిన యువకుడు



మహేష్‌చారి (ఫైల్)

ఆత్మకూరు.ఎస్(సూర్యాపేట): నెల రోజుల క్రితం తండ్రి మృతిచెందగా నెల మాసికం పెడుతూ ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడి యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలంలోని పాత సూర్యాపేట గ్రామంలో గురువారం జరిగింది. నెల రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. పాత సూర్యాపేట గ్రామానికి చెందిన పోలోజు రుక్మాచారి అనారోగ్యంతో నెల రోజుల క్రితం మృతిచెందాడు. రుక్మాచారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మహేష్ చారి (22) ఉన్నారు. మహేష్‌చారి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి రుక్మాచారి మృతిచెందడంతో మహేష్ నెల రోజులుగా గ్రామంలోనే తల్లి విజయలక్ష్మితో కలిసి ఉంటున్నాడు. గురువారం తండ్రికి నెల మాసికం పెట్టడం కోసం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి అందరూ పాత సూర్యాపేట గ్రామం సమీపంలోని చక్రయగుట్ట వద్దకు వెళ్లారు. తండ్రికి పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించిన అనంతరం స్నానం చేయడానికి మహేష్‌చారి గుట్టపై గల కోనేటిలోకి బంధువులతో కలిసి వెళ్లాడు. ఈ సమయంలో కాలుజారి మహేష్ చారి కోనేటిలో పడిపోయాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. బంధువులు వెంటనే అందులోకి దూకి బయటికి తీసుకొచ్చే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గ్రామస్తులు వచ్చి కోనేరులో వెతికి మహేష్‌చారి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లి పోలోజు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకర్ నాయక్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ మంద కృష్ణకు ఇష్టం లేదు

- మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి



పెద్దవూరలో జరిగిన మాదిగ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

పెద్దవూర, మునుగోడు: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయడం మంద కృష్ణమాదిగకు ఇష్టం లేదని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ఆరోపించారు. మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణను బీజేపీతో సాధించుకుని రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నట్లు అనిపిస్తుందని పేర్కొన్నారు. మాదిగలపై ఆయనకు ప్రేమ లేదన్నారు. పిడమర్తి రవి గురువారం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, మునుగోడు నియోజకవర్గాల మాదిగ జేఏసీ సమావేశాల్లో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 1994లో ప్రారంభమైన నాటికి, నేటికి మాదిగ జనాభాలో చాలా తేడా ఉందన్నారు. అందుకే రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలన్నదే మాదిగ జేఏసీ డిమాండ్ అని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించగానే ఎస్సీ వర్గీకరణకు సిద్ధంగా ఉన్నామని అసెంబ్లీలో ప్రకటించి, మంత్రివర్గ ఉప సంఘం వేయడం, ఏకసభ్య కమిషన్‌కు జడ్జీని నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎలా మాదిగల ద్రోహి అవుతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ముందుకు వస్తే మంద కృష్ణ మాదిగ అనేక అడ్డకుంలు సృష్టిస్తున్నాడని మండిపడ్డారు. కూటమిలో మిత్రుడైనందునే ఆంధ్రలో ఎస్సీ వర్గీకరణ కోసం చంద్రబాబుపై మంద కృష్ణ మాట్లాడటం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్, నాయకులు ఇరిగి గురునాథం, నక్క మహేష్, మేడి చంద్రస్వామి, జోగు గణేష్, నరేష్, జంగయ్య, బుడిగపాక లక్ష్మయ్య, కలకొండ పరమేష్, జిల్లా కొండలు, కుక్కమూడి ముత్యాలు, విద్యాసాగర్, సాంబయ్య, తుడుం మహేందర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో గుండెపోటుతో భక్తుడు మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఆలయ, వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన దేశపాక పోశయ్య (55) గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వచ్చాడు. సాయంత్రం 4గంటల సమయంలో కొండపైకి దర్శనానికి వెళ్లారు. మాడ వీధిలోకి వెళ్లగానే పోశయ్యకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు ఆలయాధికారులు బ్యాటరీ వాహనంలో చికిత్స నిమిత్తం పోశయ్యను కొండ కింద గల యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజు (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన సుక్క రాజు(36) భార్య ప్రియాంకతో కలిసి నాలుగు సంవత్సరాలుగా తన అత్తగారు గ్రామమైన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో అద్దెకు ఉంటున్నాడు. రాజు డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి. గురువారం మధ్యాహ్నం రాజు తన చెల్లికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మన్మథకుమార్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా యాదవరెడ్డి తెలిపారు.

బంగారానికి మెరుగు పెడతామంటూ మోసం

- ప్రత్యేక రసాయనాలతో పుత్తడిని కరిగించిన గుర్తుతెలియని వ్యక్తులు
- వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

త్రిపురారం: బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామని వచ్చిన ఇద్దరు వ్యక్తులు రసాయనాల్లో బంగారు గొలుసును ముంచి బరువు తక్కువ చేసి మహిళను మోసం చేశారు. ఈ ఘటన త్రిపురారం మండలం కామరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా పలు గ్రామాల్లో బంగారంతో పూసలు అల్లడం, మెరుగు పెడతామని ఇద్దరు వ్యక్తులు తిరుగుతున్నారు. గురువారం వారు లక్ష్మీపురం గ్రామానికి వచ్చారు. గ్రామానికి చెందిన కొంగరి సునీత తన బంగారు పూసలు గొలుసును వారికి ఇచ్చి మెరుగు పెట్టమంది. సదరు వ్యక్తులు తమ వద్ద ఉన్న ప్రత్యేక రసాయనాలతో సునీత ఇచ్చిన బంగారు గొలుసుకు మెరుగు పెట్టారు. కొద్దిసేపటి తర్వాత గొలుసు బరువు తక్కువ ఉన్నట్లు సునీత గమనించి గ్రామంలోని యువకులకు చెప్పడంతో వారు సదరు వ్యక్తులను వెంబడించి త్రిపురారం నుంచి కుక్కడం వెళ్లే పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలు సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపురారం ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

ఆశ చూపారు.. నిండా ముంచారు

- కోదాడ కేంద్రంగా ఆన్‌లైన్ యాప్ దందా
- వేలల్లో పెట్టుబడి పెట్టండి.. లక్షల్లో తిరిగి పొందండని ప్రచారం
- యువత, నిరుద్యోగులే టార్గెట్
- అనంతగిరి, మునగాల, కోదాడ మండలంలో అధికంగా బాధితులు

కోదాడ: అరచేతిలో వైకుంఠం చూపుతూ యువకులను, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని అధిక రాబడి ఆశ చూపి నిండా ముంచింది ఓ ఆన్‌లైన్ యాప్. రూ.1800 పెట్టుబడి పెడితే రోజుకు రూ.60, నెలకు రూ.1800 చొప్పున సంవత్సరం పాటు ఆదాయం వస్తుందని నమ్మబలకడంతో కోదాడ పట్టణంతో పాటు అనంతగిరి, మునగాల మండలాలకు చెందిన పలువురు ఈ యాప్‌లో పెట్టుబడి నిండా మునిగారు. మొదట రెండు నెలలు కొంత మందికి డబ్బులు చెల్లించి వారిని ఎరగా చూపి వందల మందిని ఈ దందాలోకి లాగారు. ఆ తర్వాత డబ్బులు చెల్లించడం మానేశారు. ఈ యాప్‌లో మొదట చేరిన వారు తమకు తెలిసిన వారిని, బంధువులను చేర్పించడంతో వందల సంఖ్యలో బాధితులు తయారయ్యారు. దీనిలో రూ.1800 నుంచి రూ.54లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చని నిర్వాహకులు చెప్పడంతో ఎక్కువ మంది రూ.15,000 స్కీంలో చేరినట్లు సమాచారం.



యాప్ సమాచారంతో ముద్రించిన ఫ్లెక్సీ

అసలు ఏమి జరిగిందంటే...

నాలుగు నెలల క్రితం ఆన్‌లైన్‌లో ఆర్/జీఏ పేరుతో ఒక యాప్ వచ్చింది. దేశ వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యను తీర్చడంతో పాటు పేదలు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇవ్వడమే తమ లక్ష్యంగా ఈ యాప్‌లో పేర్కొన్నారు. తమ సంస్థ కార్యాలయాలు దేశ వ్యాప్తంగా ఉన్నాయని ప్రధాన కార్యాలయం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉందని చెప్పడంతో అనేక మంది నిరుద్యోగులు వీరిని నమ్మారు. సూర్యాపేట జిల్లా కేంద్రంగా కార్యాలయాన్ని ప్రారంభించిన ఒకరు కోదాడ, అనంతగిరి, మునగాల మండలాలకు చెందిన కొందరి యువకులను దీనిలో చేర్పించారు. వీరికి కొద్ది నెలలు డబ్బులు ఇవ్వడంతో వీరు తమ బంధువులు, స్నేహితులను ఇందులో చేర్పించారు. ఆ తర్వాత డబ్బులు ఇవ్వడం మానేశారు. కోదాడ నియోజకవర్గ పరిధిలో దాదాపు 400 మంది బాధితులు ఉన్నారు.

విందులు, వినోదాలు..

ఈ యాప్‌లో చేర్పించడానికి పెద్ద ప్రచారం కల్పించారు. అనంతగిరి మండలానికి చెందిన ఒకరు తమ గ్రామంలో యువకులను చేర్పించడానికి పెద్దఎత్తున విందును ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇప్పుడు వారంతా మోసపోవడంతో లబోదిబోమంటున్నారు. చేర్పించిన వారు మాత్రం తమకేమీ తెలియదని, తాము కూడా మోసపోయామని చెబుతున్నట్లు సమాచారం.

కేసు నమోదు

సూర్యాపేట టౌన్: ఆర్/జీఏ యాప్ ద్వారా మోసపోయిన పలువురు బాధితులు గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆర్‌జీఏ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారని, అవగాహన సదస్సులు పెడుతూ యాప్‌లో రు.1800 చెల్లించి చేరితే ప్రతిరోజు 4 నుంచి 5 యాడ్‌లు చూస్తే రోజూ రు.60 యాప్‌లో జమ చేసేవారని బాధితులు పేర్కొన్నారు. ఇలా జమ అయిన మొత్తాన్ని మంగళవారం సొంత అకౌంట్‌లోకి మార్చి విత్ డ్రా చేసుకునేవాళ్లమని, ఈ నెల 23న విత్ డ్రా కోసం యాప్‌ను చూడగా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 10వేల మంది బాధితులు ఉంటారని, జిల్లాలో ఈ సంస్థకు చెందిన రీజినల్ మేనేజర్ ఏనుగు శంకర్‌రావు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.